క్లుప్తంగా

హుండీల ఆదాయం లెక్కింపు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

ఆత్రేయపురం: ర్యాలి జగన్మోహినీ కేశవస్వామి, ఉమా కమండలేశ్వర స్వామి ఆలయాల్లో హుండీలను సోమవారం లెక్కించినట్లు ఆలయ ఈఓ బీహెచ్‌వీ రమణమూర్తి తెలిపారు. జగన్మోహినీ కేశవస్వామి ఆలయంలో హుండీల ద్వారా 7 నెలల కాలానికి రూ.9,60,097, ఉమా కమండలేశ్వర స్వామి ఆలయంలో హుండీల ఆదాయం రూ.2,48,001 వచ్చిందన్నారు. ఈ కార్యక్రమాన్ని రాజమహేంద్రవరం దేవదాయ ధర్మదాయ శాఖ తనిఖీదారు టీవీఎస్ఆర్ ప్రసాద్ పర్యవేక్షించారు.

నేడు రావులమ్మ వారి పంట జాతర



కె.పెదపూడిలో శ్రీరావులమ్మ వారు

అంబాజీపేట: కె.పెదపూడి గ్రామంలో వేంచేసి ఉన్న రావులమ్మ వారి పంట జాతరను మంగళవారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. రెండేళ్లకోసారి పంట జాతర నిర్వహిస్తారు. గ్రామంలోని రైతులు, గ్రామస్తులు అమ్మవారి పూజా ఘటాలను సుమారు 15 రోజులుగా పురవీధుల్లో ఊరేగించారు. మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ అమ్మవారి పూజా ఘటాలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో జాతర చేయనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

బాణసంచా విక్రయాలకు లైసెన్స్ పొందాలి

అంబాజీపేట: దీపావళి నేపథ్యంలో బాణసంచా విక్రయదారులు తాత్కాలిక లైసెన్స్ తీసుకోవడానికి రెండు రోజులు మాత్రమే గడువు ఉందని తహసీల్దార్ జె.వెంకటేశ్వరి సోమవారం తెలిపారు. నిబంధనలకు అనుగుణంగా బాణసంచా విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేయాలని, లేకుంటే చర్యలు తప్పవన్నారు. దుకాణాలు ఏర్పాటు చేసే వ్యాపారులు సేల్స్‌ట్యాక్స్, అగ్నిమాపక, పోలీసు, పంచాయతీ నుంచి అనుమతి పత్రాలు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు.

ఖైదీలకు అన్ని సౌకర్యాలు కల్పించాలి



కొత్తపేట సబ్ జైలులో తనిఖీలు చేస్తున్న సీనియర్ సివిల్ జడ్జి ప్రకాష్‌బాబు

కొత్తపేట: రిమాండ్ ఖైదీలకు అన్ని సౌకర్యాలు కల్పించాలని రాజమహేంద్రవరం సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.ప్రకాష్‌బాబు సబ్ జైలు అధికారులు, సిబ్బందికి సూచించారు. సోమవారం ఆయన స్థానిక సబ్ జైలును ఆకస్మికంగా సందర్శించారు. లోపల అన్ని విభాగాలను తనిఖీ చేశారు. ముఖ్యంగా సెల్స్, బాత్ రూమ్స్, వంటషెడ్, బియ్యం, పప్పులు తదితర నిత్యావసర సరకులు, కూరగాయలు నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం రిమాండ్ ఖైదీల వివరాలు, రికార్డులను పరిశీలించారు. ఖైదీలతో మాట్లాడుతూ ఇక్కడ ఏమైనా ఇబ్బందులు ఉంటే తెలిపాలని అన్నారు. నేరాలు మళ్లీ చేయకుండా, సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు.

రక్తదానం.. మరొకరికి ప్రాణదానం



రక్తదానం చేస్తున్న ఏఎస్సై కృష్ణారావును అభినందిస్తున్న ఎమ్మెల్యే బండారు, డీఎస్పీ

కొత్తపేట: రక్తదానం.. మరొకరికి ప్రాణదానంతో సమానమని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో సోమవారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. స్థానిక డీఎస్పీ వై.గోవిందరావు పర్యవేక్షణలో రావులపాలెం సీఐ విద్యాసాగర్ ఆధ్వర్యంలో ఎస్సై సురేంద్ర ఈ శిబిరాన్ని నిర్వహించారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటించారు. రక్తదానం చేయడం వల్ల ఆరోగ్యంగా ఉండటంతో పాటు ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్న మరొకరికి ప్రాణదానం చేసినవారవుతారని అన్నారు. అత్యవసర చికిత్సలు, క్లిష్టమైన ప్రసవాల సమయంలో రక్తం ఎంతో అవసరమన్నారు. సుమారు 58 ఏళ్ల వయసులో ఏఎస్సై కృష్ణారావు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేశారు. ఆయనను పలువురు అభినందించారు. ఈ శిబిరంలో 52 మంది రక్తదానం చేశారు. సర్పంచ్ బూసి జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రాత్రుళ్లు రయ్ రయ్...

- బ్యారేజీపై నుంచి ఇసుక లారీల పరుగులు
- అపురూప కట్టడానికి ముప్పు
- పట్టించుకోని యంత్రాంగం



బ్యారేజీపై ఇసుక లారీల సంచారం (ఫైల్)

ఆత్రేయపురం: అపురూప కట్టడం అది.. కాటన్ మహాశయుని ఆశల సౌధమిది.. ఉభయ గోదావరి జిల్లాలను సస్యశ్యామలం చేసేందుకు నిర్మించిన వారధి అది.. ఎన్నో లక్షల ఎకరాలను పచ్చని తివాచీలా మార్చుకున్న కాటన్ బ్యారేజీకి ముప్పు ముందుంది. కొందరు అక్రమార్కుల చేష్టలకు ఈ కట్టడానికి భద్రత లేకుండా పోయింది. రాత్రయితే చాలు అక్రమ ఇసుక తరలింపు, మరోవైపు ఎలాంటి అనుమతులు లేకుండా కాటన్ బ్యారేజీపై నుంచి యథేచ్ఛగా ఈ భారీ వాహనాలను తిప్పుతున్నారు. అయితే అధికారుల చోద్యం చూస్తున్నారు. ఆత్రేయపురం మండలంలో గత కొద్ది రోజులుగా ఇసుక రీచ్ కనబడితే చాలు స్థానికులకు కూడా అవకాశం ఇవ్వకుండా ఇసుక మాఫియా వాలిపోతుంది. అక్రమంగా ఇసుకను తవ్వి తరలించుకుపోతోంది. జేబులు నింపుకొంటోంది. కూటమి ప్రభుత్వం కేవలం గోదావరి పరివాహక ప్రాంతాల్లోనే గ్రామస్తులు ఉచితంగా ఇసుకను ఎడ్ల బండ్లు, ట్రాక్టర్లపై తీసుకు వెళ్లవచ్చని అనుమతి ఇచ్చినప్పటి నుంచి ఇసుక మాఫియా రెచ్చిపోతోంది. మండల పరిధిలోని బొబ్బర్లంక, రాజవరం, వెలిచేరు, వద్దిపర్రు, పులిదిండి, పేరవరం, కట్టుంగ, తాడిపూడి తదితర గ్రామాల్లో ఎలాంటి ర్యాంపులు లేకపోయినా వందల సంఖ్యలో పగటి పూట ట్రాక్టర్లు, ఎడ్ల బండ్లతో.. రాత్రిళ్లు లారీలతో ఇసుకను దోచుకుంటున్నారు. ఈ దోచుకున్న ఇసుకను బొబ్బర్లంక బ్యారేజీ మీదుగా రాత్రిళ్లు తరలిస్తున్నారు. బ్యారేజీ బలహీనంగా ఉన్న నేపథ్యంలో భారీ వాహనాల రాకపోకలను ఇరిగేషన్ అధికారులు నిషేధించారు. కానీ ఇసుక మాఫియా లెక్కేవేరంటూ ఆమ్యామ్యాలతో సిబ్బంది నోరు మూయించి రాత్రిళ్లు బ్యారేజీపై భారీగా ఇసుక వాహనాలు పరుగులు పెట్టిస్తున్నారనే గుసగుసలు వినబడుతున్నాయి. పక్కనే ఉన్న ధవళేశ్వరం బ్యారేజీకి కాస్త మరమ్మతులు చేపట్టారు. కానీ బొబ్బర్లంక బ్యారేజీపై మాత్రం సిమెంట్‌తో గోతులు పూడ్చారు. ఇలాగే భారీ వాహనాలు బ్యారేజీపై వెళ్తే మరింత బలహీన పడే అవకాశం ఉందని వాహనచోదకులు బెంబేలెత్తిపోతున్నారు. ఇకనైనా అక్రమ ఇసుక దోపిడీని అరికట్టి, బ్యారేజీపై ఇసుక లారీల రాకపోకలు నియంత్రించాలని ప్రజలు కోరుతున్నారు. లేకుంటే అపురూప కట్టడానికి బీటలు వారే ప్రమాదముందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

నిఘా ఏర్పాటు చేశాం..



గ్రామాల్లో అనధికారిక ఇసుక తవ్వకాలు జరగకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం. ఇసుక తవ్వకాల్లో అక్రమాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటాం. సంబంధిత యజమానులపై కేసులు నమోదు చేసి, వాహనాలను సీజ్ చేస్తాం

–టి.రాజరాజేశ్వరరావు, తహసీల్దార్, ఆత్రేయపురం మండలం

భారీ వాహనాలకు అనుమతి లేదు



కాటన్ బ్యారేజీ భద్రత దృష్ట్యా భారీ వాహనాలకు అనుమతి ఇవ్వలేదు. రాత్రిళ్లు ఇసుక లారీల రాకపోకలపై నిఘా ఏర్పాటు చేస్తాం. మాట వినకుండా బ్యారేజీపైకి ఇసుక లారీలను తీసుకువస్తే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటాం.

–సునీల్‌బాబు, బ్యారేజీ జేఈ

క్యాన్సర్‌పై అవగాహన అవసరం

అంబాజీపేట: రొమ్ము క్యాన్సర్‌పై మహిళలు అవగాహన పెంచుకోవాలని స్థానిక స్త్రీల ఆసుపత్రి వైద్యులు జయశ్రీ, రాశిలు చెప్పారు. ముక్కామల హైస్కూల్‌లో హెచ్‌ఎం ఎంఎస్ఆర్ మూర్తి అధ్యక్షతన రొమ్ము క్యాన్సర్‌పై సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా స్త్రీల ఆసుపత్రి వైద్యులు మాట్లాడుతూ మగువలకు నలభయ్యేట రొమ్ము క్యాన్సర్ ద్వారా ముసలం ఏర్పడుతుందన్నారు. తప్పని సరిగా ప్రతి మహిళా వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఆ ప్రదేశంలో ఏమైనా మార్పులు గమనిస్తే వెంటనే మహిళా వైద్యులను కలసి తగిన చికిత్స పొందాలన్నారు. అనంతరం నిర్వహించిన ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో సరైన సమాధానాలు చెప్పిన విద్యార్థినులకు బహుమతులు, సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఆయా హైస్కూల్ మహిళా ఉపాధ్యాయులు, స్త్రీల ఆసుపత్రి వైద్యులు షైనీ సరెళ్ల తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక



రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

పి.గన్నవరం: ముంగండ జెడ్పీ హైస్కూల్‌లో చదువుతున్న ఇద్దరు విద్యార్థులు ఇటీవల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన సాఫ్ట్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచారు. వీరు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల హెచ్‌ఎం జి.కనకదుర్గ తెలిపారు. 8వ తరగతి విద్యార్థిని పోలాబత్తుల విజయలక్ష్మి అండర్ –14 విభాగం, పదో తరగతి విద్యార్థి కాప అక్షయకుమార్ అండర్–17 సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక అయ్యారని వివరించారు. వీరిని పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ భావన శ్రీనివాసరావు, పీఈటీ ఎస్.కమల్, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

బాణసంచా విక్రయాల్లో నిబంధనలు పాటించాలి



కొత్తపేటలో ఒక హోల్‌సేల్ షాపులో తనిఖీ చేస్తున్న సీఐ విద్యాసాగర్

కొత్తపేట: దీపావళి బాణసంచా తయారీ, హోల్‌సేల్, రిటైల్ విక్రయ కేంద్రాల వద్ద నిబంధనలు విధిగా పాటించాలని, లేకుంటే కఠిన చర్యలు తప్పవని రావులపాలెం సీఐ సీహెచ్ విద్యాసాగర్ హెచ్చరించారు. ఈ నెల 31 న దీపావళి సందర్భంగా ఇప్పటికే పలు బాణసంచా తయారీ కేంద్రాలు, హోల్‌సేల్ షాపుల్లో విక్రయాలు సాగిస్తున్నారు. మూడు రోజులు తాత్కాలిక లైసెన్స్‌లతో రిటైల్ వ్యాపారులు షాపులు వేసుకుని విక్రయాలకు సిద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో సోమవారం కొత్తపేటలో హోల్‌సేల్ షాపులు, తయారీ కేంద్రాలను సీఐ విద్యాసాగర్ తనిఖీ చేశారు. కేంద్రాల లైసెన్స్‌లు, బాణసంచా పరిమితి, నిబంధనలు పాటిస్తున్నారా? లేదా వంటి అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2015లో ఒక తయారీ కేంద్రంలో జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్లే భారీ విస్ఫోటనం సంభవించి నలుగురు సిబ్బంది, 2020లో మూలస్థానంలో ఒక ఇంట్లో ఇద్దరు మృతి చెందిన విషయాన్ని గుర్తు చేశారు. అలాంటి ప్రమాదకర సంఘటనలు పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నామని సీఐ అన్నారు. ఏ చిన్న ప్రమాదం సంభవించకుండా, ప్రాణ, ఆస్తి నష్టం కలగకుండా తయారీదారులు, వ్యాపారులు నిబంధనలు పాటించాలని సూచించారు. లైసెన్స్ లేకుండా తయారు చేసినా, ఇతర ప్రాంతాల నుంచి తెచ్చి విక్రయించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. హోల్‌సేల్ వ్యాపారులు పరిమితికి మించి గొడౌన్‌లలో నిల్వలు పెట్టినా ఆ సరకు సీజ్ చేస్తామన్నారు. తనిఖీలు నిరంతరం కొనసాగుతూనే ఉంటాయన్నారు. ఆయన వెంట ఎస్ఐ జీ సురేంద్ర, ఏఎస్సై వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి చర్యలు



కొత్తపేట గ్రామసభలో మాట్లాడుతున్న తహసీల్దార్ రాంబాబు

కొత్తపేట: గ్రామాల్లో భూ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ వై.రాంబాబు తెలిపారు. దీనికి సంబంధించి కొత్తపేట పంచాయతీ కార్యాలయం వద్ద సోమవారం గ్రామసభ నిర్వహించారు. సర్పంచ్ బూసి జయలక్ష్మి అధ్యక్షత వహించారు. పలువురు రైతులు తమ భూముల కొలతల్లో వ్యత్యాసాలు ఉన్నాయని, వాటిని సరిచేసి అప్పగించాలని కోరుతూ అర్జీలు సమర్పించారు. మరికొందరు పట్టాదార్ పాస్ పుస్తకాలు తదితర సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. తహసీల్దార్ రాంబాబు మాట్లాడుతూ గ్రామసభ దృష్టికి వచ్చిన భూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. పంచాయతీ పాలకవర్గ సభ్యుడు విళ్ల మారుతీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ



పెదపళ్లలో మృతుడు రవికుమార్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో కొత్తపేట మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి సోమవారం పర్యటించారు. పెదపళ్లలో సోదర వియోగంతో ఉన్న ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఏడిద మెహెర్ ప్రసాద్, సర్పంచ్ సత్యశ్రీ దంపతుల కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. అలాగే సంధిపూడిలో సోదర వియోగంతో బాధపడుతున్న పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు మోటుపల్లి వెంకన్నను పరామర్శించి తన సంతాపాన్ని తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు కర్రి నాగిరెడ్డి, తమ్మన శ్రీనివాస్, నామాల శ్రీనివాస్, తోరాటి గోవిందు, పోలాబత్తుల చిన్న, దొడ్డారపు సుబ్బారావు, గంటా శ్రీనివాస్, యాళ్ల రవిరాజా, గొడితి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

శిశు మందిర్‌కు చేయూత



రుద్రరాజు, మేనేజరు జైరామ్‌లను సన్మానించిన కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు

మలికిపురం: లక్కవరంలో ఉన్న సరస్వతీ శిశు మందిర్ ఉన్నత పాఠశాల అభివృద్ధి నిమిత్తం కెనరా బ్యాంక్ ఎండీ సీఈఓ కలిదిండి సత్యనారాయణ రాజు ప్రోత్సాహంతో సీఎస్ఆర్ నిధుల నుంచి 12 లక్షలు మంజూరు అయ్యాయి. ఈ నిధులతో సోమవారం శిశు మందిరం ప్రాంగణంలో అభివృద్ధి పనులు ప్రారంభించారు. నిధులు మంజూరు చేయించిన లక్కవరం కెనరా బ్యాంక్ ఫౌండర్, లక్కవరం చాంబర్ కామర్స్ అధ్యక్షుడు రుద్రరాజు గోపాల కృష్ణంరాజు కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా గోపాల కృష్ణంరాజు మాట్లాడుతూ విద్యార్థులంతా బాగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. నిధులు మంజూరు చేయించిన గోపాల కృష్ణంరాజు, బ్రాంచ్ మేనేజర్ రాజా జై రామ్‌లకు కమిటీ సభ్యులు శాలువా కప్పి సన్మానించారు. నిధులు మంజూరు చేసిన కళిదిండి సత్యనారాయణ రాజుకు పలువురు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మంగేన వెంకట నరసింహారావు, ముదునూరి విష్ణుమూర్తి రాజు, మంగెన గౌరీనాథ్, నంద్యాల వెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అప్పనరామునిలంకలో భగవద్గీత ప్రచారం

సఖినేటిపల్లి: అప్పనరామునిలంక గ్రామంలో సోమవారం త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక, మామిడికుదురు కమిటీ సభ్యులు భగవద్గీతపై ప్రచారం చేశారు. రానున్న దీపావళి పండగను పురస్కరించుకుని ప్రతి ఇంట్లో దీపావళి జ్ఞాన జ్యోతి వెలగాలనే ఉద్దేశంతో ఈ ప్రచారం చేస్తున్నట్లు కమిటీ అధ్యక్షుడు బండారు సత్యనారాయణ తెలిపారు. దీపావళి రోజున ఇంటి లోపల దీపాలు వెలిగించడం అనేది జ్ఞానాగ్నికి గుర్తు అని అన్నారు. కమిటీ సభ్యులు హనుమంతరావు, బ్రహ్మజీ, సుబ్బారావు, నరేష్, కాశీ, అన్నపూర్ణ, జాహ్నవి, జగదీష్, సత్యవతి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ఆలమూరు: ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ కె.జాన్‌లింకన్ అధ్యక్షతన స్పందన జరిగింది. మొత్తం 89 అర్జీలు వచ్చాయి. బీజేపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అయినవిల్లి సత్తిబాబు గౌడ్, తహసీల్దార్ ప్రకాష్‌బాబు, ఈఓపీఆర్డీ ఎ.రాజు, సూపరింటెండెంట్ ఎం.మెహెర్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ముళ్ల కంచె తొలగించండి



కరవాకలో గ్రావెల్ రోడ్డుకు అడ్డుగా వేసిన ముళ్ల కంచె

మామిడికుదురు: కరవాకలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నుంచి దూళ్లరేవులో శ్మశాన వాటిక వరకూ గ్రామ పంచాయతీ నిర్మించిన గ్రావెల్ రోడ్డుకు అడ్డుగా ఏర్పాటు చేసిన ముళ్ల కంచెల దడిని తొలగించాలని స్థానికులు సోమవారం కలెక్టర్ మహేష్ కుమార్‌కు వినతిపత్రం ఇచ్చారు. రేవు ఏసులక్ష్మి, రేకపల్లి రామస్వామినాయుడు తదితరులు ఈ విజ్ఞాపన పత్రాన్ని అమలాపురంలోని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందజేశారు. 1991లో ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి పంచాయతీ నిధులతో గ్రావెల్ రోడ్డు నిర్మించారు. రోడ్డు పాడైపోవడంతో మళ్లీ 2002లో రోడ్డు వేశారు. ఈ మార్గాన్ని రైతులు, స్థానికులు, శ్మశాన వాటికకు వినియోగించుకునే వారు. ఈ రోడ్డు స్థలాన్ని కబ్జా చేయాలన్న ఉద్దేశంతో 2021వ సంవత్సరం 9వ నెలలో స్థానికులు రోడ్డు మధ్యలో కొబ్బరి మొక్కలు తవ్వి, రోడ్డుకు అడ్డంగా ముళ్ల కంచె పాతారన్నారు. దీనిపై ఫిర్యాదు చేయగా ముళ్ల కంచె తొలగించి రోడ్డు మార్గాన్ని మూసేశారని తెలిపారు. ఈ మేరకు ఆక్రమణదారులు కోర్టును ఆశ్రయించగా, కోర్టు పంచాయతీకి అనుకూలంగా తీర్పు చెప్పిందన్నారు. పల్లె పండగలో సీసీ రోడ్డుకు రూ.4 లక్షలు మంజూరు చేశారని చెప్పారు. కానీ రోడ్డు వేయకుండా మళ్లీ ఆక్రమణదారులు మళ్లీ ముళ్ల కంచె వేశారన్నారు. దీనిపై అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

రైతు సమస్యలపై పోరాటం



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు

మలికిపురం: నియోజకవర్గంలో రైతులు సమస్యలపై పోరాటం సాగిద్దామని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. సోమవారం మలికిపురం పార్టీ కార్యాలయంలో వైఎస్సార్ సీపీ రైతు విభాగం నాయకుల సమావేశం జరిగింది. గొల్లపల్లి మాట్లాడుతూ మాజీ సీఎం జగన్ అనేక రైతు సంక్షేమ పథకాలను ప్రవేశ పెడితే, ప్రస్తుత ప్రభుత్వం వాటిని తొలగించి రైతులను నిలువునా ముంచిందన్నారు. రైతులకు పెట్టుబడి సాయం లేక అవస్థలు పడుతున్నారని అన్నారు. ప్రధానంగా కొబ్బరి, వరి సాగు రైతులు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. డ్రైన్లు, పంట కాలువలు సక్రమంగా పని చేయడం లేదన్నారు. ఎంపీపీ వీరా మల్లిబాబు, రైతు విభాగ నాయకులు గుబ్బల రమేష్, చెల్లుబోయిన బుచ్చియ్య మాష్టారు, బొలిశెట్టి భగవాన్, జాన శంకరరావు, నల్లి శివకుమార్, కంచి వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

వీవోఏపై కలెక్టర్‌కు ఫిర్యాదు

మలికిపురం: మండలంలోని పడమటిపాలెం వీవోఏ యడ్ల సుమలతపై గ్రామంలోని నీ కృపా డ్వాక్రా గ్రూపు సభ్యులు కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్‌కు ఫిర్యాదు చేశారు. సోమవారం గుడిమెళ్లంక టి.సావరం తాగునీటి పథకం పరిశీలనకు వచ్చిన కలెక్టర్‌ను కలసి ఈ మేరకు ఫిర్యాదు పత్రం ఇచ్చారు. వీవోఏ చేసిన అక్రమాలపై అనేక ఫిర్యాదులు చేసినా చర్యలు లేవని గ్రూప్ సభ్యులు వాపోయారు. తమకు ప్రభుత్వం నుంచి అందాల్సిన రూ. లక్షల్లో నగదు వీవోఏ సుమలత దారి మళ్లించిందన్నారు. దీనిపై తగిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ మహేష్ కుమార్ హామీ ఇచ్చారు. అక్కడే ఉన్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ బాధితులు ఇచ్చిన ఫిర్యాదుపై వెంటనే స్పందించాలని డీఆర్‌డీఏ పీడీ శివశంకర ప్రసాద్‌తో మాట్లాడారు. గ్రూపు సభ్యులు ఎస్.గీత, తాడి మేరీ తదితరులు ఫిర్యాదు చేసిన వారిలో ఉన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో ఆరోగ్యం



రాజోలులో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను తిలకిస్తున్న ఎంపీపీ శ్రీనివాస్

రాజోలు: ప్రకృతి వ్యవసాయ విధానంలో పండించిన ఆహారంతోనే ఆరోగ్యం లభిస్తుందని రాజోలు ఎంపీపీ కేతా శ్రీనివాస్ అన్నారు. సోమవారం రాజోలు ఎంపీడీఓ ఆఫీస్ ఆవరణలో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకం స్టాల్ ఏర్పాటు చేశారు. దీనికి ముఖ్య అతిథిగా ఎంపీపీతో పాటు మండల అధ్యక్షులు కేత శ్రీనివాస్ హాజరై స్టాల్‌ను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రకృతి సిద్ధంగా పండించే కూరగాయలు, ఆకుకూరలు ఆహారంగా తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉంటారన్నారు. ప్రకృతి వ్యవసాయ శాఖ జిల్లా అడిషనల్ డీపీఎం సత్యనారాయణ, ఏఓ శ్రీనివాస్ హాజరై ప్రకృతి వ్యవసాయ విధానాలను వివరించారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది డివిజనల్ ఇన్‌చార్జ్ జోసఫ్ రాజు, యూనిట్ ఇన్‌చార్జ్ శ్రీనివాసరావు, ప్రసన్న కుమార్, మల్లికా సుజి రమేష్ పాల్గొన్నారు.

పశుగణన పోస్టర్ ఆవిష్కరణ

రాజోలు: 21వ అఖిల భారత పశుగణన కార్యక్రమాన్ని ఎంపీపీ కేతా శ్రీనివాసరావు సోమవారం ప్రారంభించారు. పశుగణనకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించి ఎంపీపీ మాట్లాడారు. పశుగణనలో భాగంగా ఇంటింటికి వచ్చే ఎన్యూమరేటర్లకు పశువుల వివరాలు తెలియజేయాలన్నారు. పశుగణన చేయడం ద్వారా పశుసంవర్ధక శాఖ పథకాలను సమర్థవంతంగా అమలు చేసేందుకు వీలు కలుగుతుందన్నారు. ఎంపీడీఓ డి.రాంబాబు, పొన్నమండ పశు వైద్యులు బి.సంపత్‌కుమార్, ఏపీఓ జి.లక్ష్మి, కమలనాథ్, వీఎల్ఎస్ మూర్తి, డీఈఓ రాఘవ, సోమిశెట్టి ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన ట్రస్టుకు ఫ్రిజ్ బహూకరణ



అంతర్వేదిలో నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం ఇచ్చిన దాతకు స్వామివారి చిత్రపటం అందజేత

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహ స్వామివారి దేవస్థానంలో నిత్యాన్నదాన ట్రస్టుకు సోమవారం కేశవదాసుపాలెం యూనియన్ బ్యాంకు బ్రాంచ్ సిబ్బంది ఫ్రిజ్ బహూకరించారు. ఈ మేరకు ఆలయంలో అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణకు, రాజమహేంద్రవరం రీజినల్ హెడ్ విశ్వేశ్వరరావు అందజేశారు. బ్యాంకు అధికారులకు స్వామివారి దర్శనం చేయించి, ప్రసాదం, స్వామి చిత్రపటం దేవస్థానం తరఫున అందజేశారు. బ్రాంచి మేనేజర్ దుర్గారావు, సిబ్బంది బీఆర్ఎం ఫణి పాల్గొన్నారు.

- అంతర్వేది ఆలయంలో నిత్యాన్నదాన ట్రస్టుకు రాజోలుకు చెందిన కె.అచ్యుత శివరామదాసు, వీరరాఘవ కరుణాంబిక దంపతులు రూ.51,116 విరాళంగా సమర్పించారు. ఈ మొత్తాన్ని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణకు ఇచ్చి, స్వామి చిత్రపటం దాత అందుకున్నారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక



పుల్లేటికుర్రులో విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం సూర్యకనకదుర్గ

అంబాజీపేట: రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు పుల్లేటికుర్రు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్‌ఎం కె.సూర్యకనకదుర్గ, పీడీ అందె సూర్యనారాయణ తెలిపారు. స్థానిక హైస్కూల్‌లో విద్యార్థులను పలువురు సోమవారం అభినందించారు. ఇటీవల రాజమహేంద్రవరంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఉమ్మడి జిల్లాల జిల్లా స్థాయి అథ్లెటిక్ పోటీలు మనోళ్లు సత్తాచాటారు. అండర్–14 విభాగంలో కొప్పిశెట్టి మనోజ్ 400 మీటర్ల రన్నింగ్‌లో ద్వితీయ స్థానం, 600 మీటర్లలో తృతీయ స్థానం, డొల్లా విఆహన్ లాంగ్ జంప్‌లో ద్వితీయ స్థానం, 400 మీటర్ల రన్నింగ్‌లో తృతీయ స్థానం సాధించారన్నారు. అండర్–17 విభాగంలో చీరవరపు జయశ్రీ మూడు కిలోమీటర్ల రన్నింగ్ పోటీల్లో ప్రథమం, 1500 మీటర్లలో ద్వితీయ స్థానం, సీహెచ్ హర్షవర్ధిని మూడు కిలో మీటర్ల రన్నింగ్‌లో ద్వితీయ స్థానాలను కై వసం చేసుకున్నారన్నారు. జిల్లా స్థాయి పోటీలలో అత్యంత ప్రతిభ కనబర్చడంతో మనోజ్, విహాన్, జయశ్రీ, హర్షవర్ధినిలు రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ పోటీలకు ఎంపికయ్యారని చెప్పారు. త్వరలో ఏలూరు, శ్రీకాకుళం జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారన్నారు. ఎంపికైన నలుగురు విద్యార్థులతో పాటు, వీరికి శిక్షణ ఇచ్చిన పీడీ సూర్యనారాయణలను సర్పంచ్ జల్లి బాలరాజు, పీఎంసీ చైర్మన్ నూకల రత్నమాల, ఎంపీటీసీలు వదలి కృష్ణమూర్తి, కుసుమ వెంకటేష్, పబ్బినీడి రాంబాబు, ఎంఈఓలు కాండ్రేగుల వెంకటేశ్వరరావు, మోకా ప్రకాష్ అభినందనలు తెలిపారు.

ప్రతిభ చాటారు

రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీల్లో తొండవరం జెడ్పీ హైస్కూల్‌కు చెందిన సవరపు లావణ్యశ్రీ పాల్గొని అత్యంత ప్రతిభ కనబర్చిందని హెచ్‌ఎం పీవీ కేశవాచార్యులు తెలిపారు. స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో లావణ్యశ్రీను ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు. 43వ రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ చిత్తూరు జిల్లా కాణిపాకంలో జరిగిన రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీల్లో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా జట్టు ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. ఈ విజయంలో లావణ్యశ్రీ కీలక పాత్ర వహించి అందరి మన్ననలు పొందిందన్నారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు తర్ఫీదునిచ్చిన పీడీ పి.సూర్యనారాయణతో పాటు, లావణ్యశ్రీను, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, సర్పంచ్ పేరాబత్తుల రామలింగరాజు (దొరబాబు), ఎంపీటీసీ వాకపల్లి దొరబాబు, పీఎంసీ చైర్మన్ పేరాబత్తుల వెంకట సుబ్బారావు, రోహిణి ఆస్పత్రి వైద్యులు వివిఎస్ఎస్.మూర్తిలు అభినందించారు.

5న స్కవర్ స్లూయిజ్ ఆపరేషన్

ఆత్రేయపురం: గోదావరిలో ఇసుక మేటలు తొలగింపులో భాగంగా వచ్చే నెల 5న బొబ్బర్లంక బ్యారేజీ వద్ద స్కవర్ స్లూయిజ్ ఆపరేషన్ ద్వారా నీటిని విడుదల చేయనున్నట్లు గోదావరి హెడ్‌వర్క్స్ ఏఈ సాయిరామ్ తెలిపారు. 4న విజ్జేశ్వరం, 5న బొబ్బర్లంక, 6న ధవళేశ్వరం బ్యారేజీ స్లూయిజ్ ద్వారా నీరు విడుదల చేస్తామన్నారు. ఏటా ఇసుక మేటలు తొలగించేందుకు స్లూయిజ్ ద్వారా నీటిని విడుదల చేస్తామన్నారు. 5న సెంట్రల్ డెల్టా కాలువ గేట్లు తెరిచి నీటిని విడుదల చేస్తామన్నారు. దీనిద్వారా గోదావరిలో ఇసుక మేటలు తొలగి పంట పొలాలకు సమృద్ధిగా నీరు అందుతుందని వివరించారు.

సేవలు పునరుద్ధరించాలి

ఆలమూరు: జొన్నాడలో ఏడాదిన్నరగా నిలిచిపోయిన హోమియో వైద్య సేవలను పునరుద్ధరించాలని ఆ గ్రామ మాజీ సర్పంచ్ తాడి శ్రీనివాసరెడ్డి, బీజేపీ నేత అయినవిల్లి సత్తిబాబు గౌడ్ కోరారు. ఈ మేరకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావుకు వినతిపత్రాన్ని అందజేశారు. మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ గొడవర్తి దుర్గాప్రసాద్, శ్రీనివాసు పాల్గొన్నారు.